www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 6 జులై 2024
5
ఏలూరు

గోదావరికి వరద జోరు

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులు, కొండవాగులు పొంగి గోదావరిలో కలుస్తుండటంతో వరద ప్రవాహం పెరిగింది. శుక్రవారం నాటికి పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 26.470 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.350 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 26.530 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 15.330 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు పోలవరం ప్రాజెక్టు ఇఇ మల్లికార్జునరావు, వెంకటరమణ తెలిపారు.

పట్టిసీమ వద్ద గోదావరి ఉధృతి

పరిహారం లేదు.. పరిశ్రమా లేదు..!

- వట్లూరులో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- టిడిపి ప్రభుత్వం రావడంతో వెమ్ టెక్నాలజీ ఏర్పాటుపై చర్చ
- అప్పట్లో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం
- ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం ఇస్తామని హామీ
- ఎనిమిదేళ్లు గడిచినా చిల్లిగవ్వ ఇవ్వని దుస్థితి
- మా భూములు మాకివ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు పేరుతో వట్లూరులో రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. పరిశ్రమ నెలకొల్ప లేదు. టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ చర్చ సాగుతుండగా తమకు పరిహారమైనా ఇవ్వండి, లేకపోతే భూములైనా ఇచ్చేయండని రైతులు గగ్గోలు పెడుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం గెలిచిన తర్వాత ప్రతి జిల్లాలోనూ భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని చెప్పింది. అందులో భాగంగా 2016లో వట్లూరులో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. పరిశ్రమ ఏర్పాటుకుగాను పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలోని దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా ప్రభుత్వం కేటాయించింది. ఈ భూములను దశాబ్దకాలం నుంచి అక్కడి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇవి ప్రభుత్వానికి చెందిన చెరువు భూములంటూ ప్రభుత్వం బలవంతంగా లాగేసుకుంది. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో వెనక్కి తగ్గిన పాలకులు ఇవి ప్రభుత్వ భూములు కాబట్టి ఎకరాకు రూ.2.50 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ సమయంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ రైతులకు, ప్రభుత్వానికి మధ్య రాయబారం నడిపి ఒప్పించారు. అప్పట్లో ఉండి ఎంఎల్‌ఎగా ఉన్న వేటుకూరి వెంకట శివరామరాజు కుటుంబ సభ్యులకు సంబంధించి ఈ భూముల కేటాయింపు జరిగింది. అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబు వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా హాజరయ్యారు. శంకుస్థాపన స్థాపన వ్యవహారం అట్టహాసంగా సాగించారు. తర్వాత మూడేళ్లపాటు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పరిశ్రమ ఏర్పాటు కాలేదు. రైతులకు సైతం పరిహారం ఇవ్వలేదు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమ ఏర్పాటు పూర్తిగా అటకెక్కేసింది.

భూములైనా ఇవ్వండి.. పరిహారమైనా చెల్లించండి

దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూములు తీసుకున్న ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వకపోవడంపై రైతుసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళన సాగించారు. అప్పటి టిడిపి ప్రభుత్వంగాని, తర్వాత వైసిపి సర్కార్‌గాని రైతుల గోడు పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్లు గడిచిపోయింది. పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో 2022 ఏప్రిల్‌లో ఈ భూములను వెమ్ టెక్నాలజీ సంస్థ నుంచి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. ఈ భూములు ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. రైతులకు తిరిగివ్వలేదు. ఎంతోమంది రైతులు తమ పిల్లలకు వివాహాలు చేస్తున్నప్పుడు ఆ భూములను లాంఛనాలుగా ఇచ్చారు. దీంతో ఆయా రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో పరిశ్రమల ఏర్పాటు తమ ప్రథమ ప్రాధాన్యం అంటూ చెబుతోంది. దీంతో వట్లూరు భూముల్లో ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. దీంతో మాకు పరిహారమైనా ఇవ్వండి.. లేకపోతే.. భూములైనా ఇచ్చేయండని రైతులు కోరుతున్నారు. 2016లో అప్పటి ధరలను బట్టి ఎకరాకు రూ.2.60 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ అంశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందనే చర్చ నడుస్తోంది. అప్పట్లో రైతులకు, ప్రభుత్వానికి మధ్య రాజీ కుదిర్చిన చింతమనేని ప్రభాకర్ మళ్లీ ఎంఎల్‌ఎగా గెలిచారు. ఆయన రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

నిర్వాసితులకు వసతులు కరువు

తక్షణం పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
ఉపాధి పనులు చూపాలి
ఏపి వ్యకాస, రైతు, కౌలురైతు, గిరిజన సంఘాల నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసి పునరావాస కేంద్రాలకు వచ్చిన నిర్వాసితులను పట్టించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘాల రాష్ట్ర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జీలుగుమిల్లి మండలంలోని బేతాల, గాజులగొంది, సిరివాక పునరావాస గ్రామాల్లో నేతలు పర్యటించారు. నిర్వాసితులైన రైతులు, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు పేరుతో గ్రామాలను ఖాళీ చేయించి చేతులు దులుపుకున్నా రన్నారు. పునరావాస కాలనీలకు వచ్చి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ కనీస అవసరాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా తాగునీరు, శ్మశాన వాటిక, గుడి, బడి, ఉపాధి, రోడ్లు, డ్రెయినేజ్ వ్యవస్థలు కూడా కల్పించకపోవడంతో తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పునరావాస గ్రామాల్లోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వారి బతుకులు ఎలా ఉన్నాయో చూసేందుకు నాయకులు రాకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో అక్కడక్కడా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా పిచ్చి మొక్కలతో నిండిపోయాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాణి మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో కనీస సౌకర్యాల లేమి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ సిరివాక గ్రామంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్నా కనీసం వారికి ఉపాధి హామీ పనులు కూడా చూపించకపోవడంతో పనులులేక అల్లాడుతున్నారని విమర్శించారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన వారందరికీ పరిహారపు వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, గుడెల్లి వెంకట్రావు, కారం నాగ దుర్గ పాల్గొన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న నేతలు

డిగ్రీ కళాశాల, ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

ఎపి గిరిజన సంఘం రాష్ట్ర నేత మంతెన సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నేత మంతెన సీతారాం కోరారు. ఎపి గిరిజన సంఘం బృందం మండలంలోని మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా కనీసం పూర్తి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. కళాశాల నిర్మాణం సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల కేటాయించిన నిధులు వెనక్కెళ్లిపోయాయన్నారు. దీంతో ఆ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయన్నారు. గత ప్రభుత్వం గిరిజనులకు ఉన్నత విద్య అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. అల్లి కాల్వ వద్ద నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.50 కోట్లు కేటాయించినప్పటికీ నిర్మాణం నత్తనడకన సాగడం బాధాకరమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో అసంపూర్తిగా నిలిచిన ఆసుపత్రి, డిగ్రీ కళాశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డిగ్రీ కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో వైద్యం, విద్యారంగాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, పోలోజు నాగేశ్వరరావు, సుంద్రు బుల్లెమ్మ, అన్నిక వెంకటస్వామి, తాతి రాంబాబు, పూసం దుర్గారావు, రాజన్న, సోయం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కట్టడాలను పరిశీలిస్తున్న నేతలు

పిఎం అవార్డులకు సమాచారంపై కలెక్టర్ ఆరా

ఏలూరు: ప్రధానమంత్రి అవార్డులు-2023 కోసం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు కేంద్ర పరిశీలన బృందానికి అందించిన సమాచారాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో శ్రేష్టత కోసం ప్రధానమంత్రి అవార్డులు-2023 ఎంపికలో భాగంగా జిల్లాలో గత నెలలో పర్యటించిన కేంద్ర బృందం పరిశీలించిన అంశాలు, సంబంధిత శాఖల అధికారులు కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రధానమంత్రి అవార్డులు-2023 కోసం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల తీరును లబ్దిదారుల నుంచి సమాచారం సేకరించిందన్నారు. కేంద్ర బృందం జిల్లాలోని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, హర్‌ఘర్ జల్ యోజన, మిషన్ ఇంద్రధనుష్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పిఎం స్వానిధి, ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పిఎం విశ్వకర్మ యోజన, పిఎం ముద్రయోజన, ప్రధానమంత్రి పోషణయోజన తదితర పథకాలు అమలు చేస్తున్న సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించిన అంశాలను, కేంద్ర బృందానికి అందించిన సమాచారాన్ని కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎన్‌వివి.సత్యనారాయణ, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, డిఇఒ అబ్రహం, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.రాజు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, ఎల్‌డిఎం నీలాద్రి పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నివేదికలపై చర్చ

రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు షేరింగ్ జోర్డెన్ భూటియా, మేష్రమ్ గౌరవ్ మధుకర్, పి.కీర్తి నారాయణ్ కలెక్టర్ కె.వెట్రిసెల్విని శుక్రవారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుకు సంబంధించిన ఎన్నికల వ్యయ నివేదికలపై కలెక్టర్‌తో చర్చించారు. ఏలూరు జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని పరిశీలకులు కలెక్టర్‌కు చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ తమ ఎన్నికల వ్యయ పూర్తి వివరాలు ధ్రువీకరించి నివేదికలు పూర్తిస్థాయిలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. దీనిపై వెంటనే రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు.

హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇకపై ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ట్రాఫిక్ సిఐ కె.శ్రీనివాసరావు, ఆర్‌టిఒ కె.శ్రీహరితో కలిసి హైకోర్టు ఆదేశాలననుసరించి ద్విచక్ర వాహనదారుల భద్రతకు సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 3703 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా వారిలో 3042 మంది హెల్మెట్ ధరించకపోవడమే కారణమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రయాణం సాగించాలన్నారు. యువత ద్విచక్ర వాహనాలు అతివేగంగా నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. కుటుంబ యజమాని, యువత, ముఖ్యంగా విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని అన్నారు. రవాణా, పోలీస్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేయడానికి చర్యలు చేపడతారని తెలిపారు. ట్రాఫిక్ సిఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తన ప్రాణాన్నే కాకుండా తన కుటుంబ సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని వాహనం నడపాలని, దీనికి సంబంధించిన భద్రతా మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని అన్నారు. ఆర్‌టిఒ కె.శ్రీహరి మాట్లాడుతూ వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించడంతోపాటు అతివేగాన్ని నియంత్రించుకోవాలని కోరారు. వీటిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి తమ కార్యాలయంలో కమిటీ ఏర్పాటు చేశామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై డిపిఒ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి 2013లో ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. చట్టం అమలులో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు తమ కార్యాలయంలోని మహిళలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, న్యాయవాదితో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఫిర్యాదు బాక్సు కూడా ఏర్పాటు చేస్తామని, కార్యాలయంలోని మహిళలు తమ ఫిర్యాదులను ఈ బాక్సులో వేస్తే నిర్ణీత సమయంలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసరుగా జూనియర్ అసిస్టెంట్ కొయ్య సునీత, సిబ్బంది ఫాతిమా, విజయ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ ప్రతినిధి కృష్ణారావు, సీనియర్ సహాయకులు కిషోర్, సురేష్, సిబ్బంది సోములు, తాహేరా, చంద్ర, సత్య పులి తదితరులు పాల్గొన్నారు.

పుట్రేపు రోడ్డును అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నో ఏళ్లుగా అధ్వాన్నంగా ఉన్న పుట్రేపు రోడ్డును అభివృద్ధి చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు అనుమోలు మురళీ డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎఎస్ఆర్ నగర్ కూడలిలో కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పుట్రేపు రోడ్డు అభివృద్ధి లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని కాంట్రాక్టర్లు జెసిబిలతో పనులు ప్రారంభించారు, కానీ 5 నెలలు గడుస్తున్నా ఆ పనులు ముందుకు సాగడం లేదన్నారు. అంతే కాక బండివారిగూడెం సమీపంలో, పుట్రేపు ఊరగుంట చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి వదిలేశారన్నారు. ఆ గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఆ గోతులు వల్ల ఆర్‌టిసి బస్సు సౌకర్యం కూడా రద్దు చేశారని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధితో పాటు కల్వర్టులు త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం కార్యకర్తలు బాణాల రామారావు, బరగడ కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ఏలూరు టౌన్ : అపరిశుభ్ర పరి సరాలు రోగాలకి ఆవాసాలని పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రతని, సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా జీవించవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు లంకపేట రెండవ రోడ్‌లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడడం వల్ల కీటకాలు అభివృద్ధి చెంది ముఖ్యంగా దోమలు, ఈగలు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు సమస్యలతో బాధపడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా దోమలు పెరగకుండా ఇంటి పరుషాలు పల్లపుప్రాంతాలు మట్టితో పూడ్చుకోవాలని, సాధారణంగా మనం వాడే తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చన్నారు. మురికి కాలువలో చెత్త వేయరాదని సూచించారు. ఈగల అభివృద్ధికి ఇంటి పరిసరాల్లో చెత్త పోగులు, పేడ పోగులు పెట్టరాదని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లంకపేట ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

పోలీసులకు రివార్డులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందికి కోర్టు రూ.1.65 లక్షలు రివార్డును ప్రకటించగా జిల్లా ఎస్‌పి మేరి ప్రశాంతి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఉంగుటూరు మండలం కంసాలిగుంటలో గత ఏడాది జనవరి 16న పేకాట శిబిరంపై అప్పటి చేబ్రోలు ఎస్ఐ కాశి స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేయగా 23 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8,45000 స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచారు. దీంతో ఒక్కొక్క జూదరుడికి కోర్టు రూ.300 జరిమాన విధించారు. ఈక్రమంలో పేకాట శిబిరాల్లో దాడుల్లో పాల్గొన్న ఎస్ఐతో పాటు నలుగురు సిబ్బందికి కోర్టు వారు రివార్డుగా అందించిన రూ.1.65 లక్షల చెక్కులను జిల్లా ఎస్‌పి ఏలూరులో అందించి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీసులను అభినందించారు.

పోలీసులకు రివార్డు చెక్కులు అందించిన ఎస్‌పి

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు అన్నారు. మండలంలోని కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాద్ రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్టెప్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్, మోటివేషనల్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, మానవత సంస్థ జిల్లా ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మన్ ఎ.నాగేశ్వరరావు విచ్చేసారు. మోటివేషనల్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు విద్యార్థులకు లక్ష్య నిర్ణయం, ఆత్మ విశ్వాసం, విద్యార్థులు శక్తి వంతంగా మారటానికి ఉపయోగపడే చూడటం, వినటం, మాట్లాడటం, ఆలోచించటం, పనిచేయటం వంటి ఐదు రకాల అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, మంచి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా బాగా చదివి అభివృద్ధి చెందాలని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వంశీకృష్ణ, సైకాలజిస్టు సాయి కుమార్ అన్నారు. శుక్రవారం దెందులూరు మండలం గొప్పన్నపాలెం గ్రామంలో ఉన్న సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియల్ ఆధ్వర్యంలో కళాశాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి డాక్టర్ సిహెచ్.వంశీకృష్ణ, టి.సాయి కుమార్, సైకాలజిస్ట్ వంశీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లవాడి మానసిక స్థితి ఏ విధంగా ఉంటుంది, వారిని ఎలా అర్థం చేసుకోవాలి, గేమ్స్ ఆడేటప్పుడు గాయాలు ఎలా జరుగుతాయి, వాటికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అతిథులుగా విచ్చేసిన వారికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నతనియల్, వైద్యులు, విద్యార్థులు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్‌లో 2012 నుంచి పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌ను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు సమగ్ర శిక్ష జెఎసి వైస్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 2012 నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, మున్సిపాలిటీ పాఠశాలల్లో సమగ్ర శిక్ష కింద ఐదువేల మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారన్నారు. వారికి ఈ రోజు వరకు ఉద్యోగ భద్రత లేదని, చాలీ చాలని వేతనాలతో బతుకుతున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి లోకేష్ తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి అందరి ఉద్యోగులకు తమ ప్రభుత్వంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మురుగునీటిలో దహన సంస్కారాలు

ఏలూరు టౌన్ : ఏలూరు వన్ టౌన్ ఏరియాలో ఉన్న వెంకన్న చెరువు స్మశాన వాటికలో మురుగునీరు పేరుకుపోవడంతో, మురుగునీటిలో దహన సంస్కారాలు చేస్తున్నారు. స్థానిక ప్రజలు మురుగు నీటిని తొలగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఏలూరు అర్బన్: అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక సిఆర్ రెడ్డి ఇంటర్మీడియట్ కళాశాలలో బహుమతుల ప్రధానం చేశారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, హేలాపురి బాలోత్సవం, ఇతర సంఘాలతో కలిపి మొత్తం 127 సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనంలో టి.మనోజ్ కుమార్ ప్రథమ బహుమతి, వ్యాసరచనలో డి.దినేష్ ప్రథమ బహుమతి గెలుచుకోవడంతో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయరామరాజు చేతుల మీదగా బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం లింగరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆనాడు ఉభయగోదావరి జిల్లా ప్రాంతంలో బ్రిటిష్ వారిపై తిరగబడి పన్నులు ఎందుకు కట్టాలంటూ పెద్ద ఉద్యమం చేశారని, స్వయంగా దొరికే పంటలపైన కూడా బ్రిటిష్ వారు పన్నువేస్తే దానిపైన పెద్ద ఎత్తున గిరిజనులు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని, కానీ ఈరోజు ప్రభుత్వాలు అల్లూరి సీతారామరాజుని ఒక మతం, ఒక కులానికే పరిమితం చేస్తున్నారని అన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఎక్కడా అభివృద్ధి లేదని, మళ్లీ 70 ఏళ్లకి వెనక్కి వెళ్లే పరిస్థితి కనపడుతుందని చెప్పారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే దేశంలో మూతపడిన 56 వేల స్కూళ్లను తిరిగి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలోఎస్‌ఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

శ్రీదేవి లేబ్ అధినేత ఈశ్వర్ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

గత నాలుగు దశాబ్దాలకుపైగా లాబ్ నిర్వాహకులుగా, ఆర్ ఎంపీగా సేవలు అందించిన శ్రీదేవి లాబ్ అధినేత ఈశ్వర్(70) హార్ట్ అటాక్‌తో శుక్రవారం ఉదయం మృతి చెందారు. మండలంలోని లక్కవరంకు చెందిన ఈశ్వర్ స్థానికంగా శ్రీదేవి లాబ్ పేరుతో వేలాది మందికి వైద్య సేవలు అందించారు. పట్టణ ప్రముఖులుగా, సేవా తత్పరుడిగా గుర్తింపు పొందారు. మానవత సంస్థ సభ్యుడిగా గతంలో రోటరీ సభ్యుడిగా సేవలు అందించారు. పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ మహేష్

ఏలూరు సిటీ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 3 రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి కేంద్ర రక్షణశాఖా మంత్రి రాజనాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. రాష్టానికి సంబంధించిన డిఫెన్స్(రక్షణశాఖ) ప్రోజెక్టులపైన, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపైన చర్చించారు.

ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు

ఉంగుటూరు: పిఎంపి అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో కైకరం వనచర్ల ఫంక్షన్ ప్లాజాలో, అర్జున్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. పలువురు వృద్ధులు, స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామ సర్పంచి సలగల గోపి, జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, జనసేన, టిడిపి నాయకులు, కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

'రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వేయాలి'

జంగారెడ్డిగూడెం టౌన్: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి చాలా అస్తవ్యస్తంగా ఉందని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రి కిరణ్ అన్నారు. వర్షాకాలం రావడంతో మరీ ఎక్కువగా ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి నెలకొందన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం చుట్టుపక్కల జరుగుతున్న రహదారుల ప్రమాదాల రీత్యా జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌లో సరైన, మెరుగైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ఏలూరు తరలించడం ఇబ్బందిగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో సుమారు జంగారెడ్డిగూడెం నుంచి తడికలపూడి వరకు 32 కిలోమీటర్లు కలిగిన రహదారి అధ్వానంగా మారిందని, చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ దృష్టి సారించాలని కోరారు.

'మేధాపాట్కర్‌కు శిక్ష విధింపు దుర్మార్గం'

ఏలూరు అర్బన్ : ప్రముఖ పర్యావరణవేత్త, నర్మదా బచావో నాయకురాలైన మేధా పట్కర్‌కు ఐదు నెలల జైలు శిక్షను, రూ.10 లక్షల భారీ జరిమానా విధిస్తూ ఢిల్లీ కోర్టు తీర్పునివ్వడం అత్యంత దుర్మార్గం అని, ఈ తీర్పును ప్రజాస్వామిక వాదులందరూ తీవ్రంగా ఖండించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నర్మదా డ్యామ్‌లో మునిగిపోయే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా పునరావాస సమస్య జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడంలో మేధా పట్కర్ ఎంతో కృషి చేశారని, పునరావాసం కోసం నిర్వాసితులకు నాయకత్వం వహించిన మేధా పట్కర్‌పై ఎవరో మెయిల్లో పంపించిన దానిపై ఆధారపడి గుజరాత్‌లో ఫైలైన కేసును ఢిల్లీకి మార్చుకొని 23 సంవత్సరాల తర్వాత ఆమెపైన ఈ విధమైన తీర్పు ఇవ్వడం బిజెపి ఫాసిస్ట్ తరహా పాలనకు నిదర్శనమన్నారు. మేధా పట్కర్‌పై విధించిన జైలు శిక్ష, భారీ జరిమానాను తక్షణమే రద్దు చేయాలని, ప్రజాస్వామిక వాదులపై పెట్టిన అక్రమ కేసులు అన్నిటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

ఏలూరు అర్బన్: దేశంలో దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీ సొంతమని, కార్మిక, కర్షక పీడిత ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏలూరు ఏరియా జనరల్ బాడీ సమావేశం కురెళ్ల వరప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నేడు దేశంలో, రాష్ట్రంలో అనేక హామీలను ఇచ్చి అధికారం పొందిన ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చూడాలని, తద్వారా ప్రజలందరికీ సుపరిపాలన అందించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కార్యవర్గసభ్యులు మావురి విజయ పాల్గొన్నారు.

అంతరాష్ట్ర ముద్దాయి అరెస్టు

ముసునూరు: నూజివీడు డివిజన్ పరిధిలోని ముసునూరు మండల పోలీస్ స్టేషన్‌లో అంతరాష్ట్ర ముద్దాయి అరెస్ట్ అయినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. శుక్రవారం ముసునూరు పోలీస్ స్టేషన్ నుంచి అంతరాష్ట్ర దొంగైన పోనగంటి తేజ్‌కుమార్‌ను తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లోని సిఐటి పోలీస్ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. ఇతనిపై సుమారుగా 50కి పైగా అంబర్‌పేట, కూకట్‌పల్లి, అన్‌నంతర్‌గోమి, బూచిపల్లి, మధురానగర్, హైదరాబాద్, సైబరాబాద్, రామగుండం తదితర పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. గత వారం రోజుల క్రితం ముసునూరు మండలంలోని రమణక్కపేట గ్రామంలో పేకాట ఆడుతున్న సమయంలో ముసునూరు ఎస్ఐ వాసు తమ సిబ్బందితో దాడిచేసి పట్టుకోగా అతన్ని పట్టుకుని పై స్థాయి అధికారులకు నివేదిక పంపే విధానంలో అతను పేరుపొందిన గజదొంగని, అతన్ని తమకు అప్పగించాలని హైదరాబాద్ ప్రాంత పోలీసులు కోరడంతో వారికి అప్పగించారు. వాస్తవంగా అతను నూజివీడు డివిజన్ ప్రాంతంలోని చాట్రాయి మండలంలోని చిత్తపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కావడం విశేషం.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

డ్రైవర్‌కు గాయాలు

జంగారెడ్డిగూడెం టౌన్: జంగారెడ్డిగూడెం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఖమ్మం నుంచి విశాఖ పోర్టుకు రాయి లోడుతో వస్తున్న లారీ జంగారెడ్డిగూడెం జాతీయ రహదారిపై రాగా అటుగా రాజమండ్రి నుంచి వస్తున్న సరుకుల ట్రాన్స్‌పోర్టు లారీ రెండూ ఎస్ఆర్ బంక్ సమీపంలో బలంగా ఢీకొన్నాయి. దీంతో ఖమ్మం నుంచి వస్తున్న లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ : వ్యక్తి మృతి

కామవరపుకోట: మద్యం తాగి ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రావికంపాడు గ్రామంలో జరిగింది. తడికలపూడి ఎస్ఐ జయ బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన మద్దిపట్ల నాగేశ్వరరావు, వీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన ఆవుల ఇస్సాకు(35) గురువారం రాత్రి వారిద్దరూ మద్యం సేవించి రావికంపాడు గ్రామంలోని రామాలయం ఆవరణలో పడుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి సమయంలో ఆవుల ఇస్సాకు సెల్ ఫోన్ పోయింది. కనపడలేదని పక్కన పడుకున్న మద్దిపట్ల నాగేశ్వరరావును అడిగాడు, దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న నాగేశ్వరరావు పక్కనే ఉన్న కర్రతో ఇస్సాకు తలపై బలంగా కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడు నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జయ బాబు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిందితుడు మద్దిపట్ల నాగేశ్వరరావు గతంలో ఇదేవిధంగా భార్యను కొట్టి హతమార్చినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్: రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంజీవరావు ఆధ్వర్యంలో తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని పవర్ పేట ప్రాంతానికి చెందిన యడ్లపూడి అప్పారావు(41) ప్రసాదంగా కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం గేట్ బజార్ ప్రాంతంలో వెళ్లి రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని రైలు బండి అతన్ని ఢీకొంది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంజీవరావు ఆనివారాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జంతువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

నేడు ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన..

టి.నరసాపురం: పెంపుడు జంతువులంటే చాలా మంది ప్రేమగా చూసుకుంటారని, అయితే వాటి పెంపకంలో జంతు ప్రేమికులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని మండల పశువైద్యాధికారి కాల్వ కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 6న ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. జంతువులు, పక్షుల పెంపకంలో కొన్ని జాగ్రత్తలు అవసరమని, వాటి నుంచి మనుషులకు కొన్ని వ్యాధులు సంక్రమిస్తుండటమే ఇందుకు కారణమన్నారు. మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు బ్యాక్టీరియా లేదా పరాన్న జీవుల ద్వారా వివిధ వ్యాధులు వ్యాప్తి చెందడాన్ని జునోసిస్ అంటారని తెలిపారు. ప్రాణాంతక వ్యాధులు ఎక్కువగా జంతువులు, పక్షుల నుంచి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వీటిపై అవగాహన పెంచుకోవాల్సి ఉందని ఆయన సూచించారు. పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు సంక్రమించకుండా వాటికి యాంటిరేబిస్ టీకాలు వేస్తారన్నారు. వాటిలో ఉండే వైరస్ మనుషుల్లోకి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఇందుకు ఏటా ఈనెల 6వ తేదీన జునోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. మనుషుల నుంచి పశువులకు సంక్రమించే జునోసిస్ వ్యాధుల ఆధారంగా ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్కకాటు బారిన పడిన ఒక పిల్లవాడికి టీకా మందు ఇచ్చి బ్రతికించిన రోజు ఇదే కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా జునోసిస్ దినోత్సవంగా జరుపుకుంటామని వివరించారు. సుమారు 180 రకాలకు పైబడిన వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. జునోసిస్ వ్యాధుల గురించి ప్రజలను అప్రమత్తం చేసి, రోగాల బారిన పడకుండా చేయడమే ప్రపంచ జునోసిస్ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సుమారు 280 వ్యాధులు సంక్రమిస్తాయి. వీటివల్ల మరణించే వారి సంఖ్య కూడా ఎక్కువేనన్నారు. దీంతో మన చుట్టూ తిరిగే కుక్కలు, పిల్లులు, ఇతర జంతువులకు తప్పకుండా యాంటీ రేబీస్ టీకాలు వేయించాలని అన్ని పశు సంవర్ధక శాఖ వైద్యశాలల్లో టీకాల పంపిణీ చేపట్టనున్నారు. ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు.

మండవల్లి: పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ డివి వరప్రసాద్ తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులను జునోటిక్ వ్యాధులు అంటారన్నారు. 1885లో లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారి కుక్క కాటుకు గురైన బాలుడికి వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాను విజయవంతంగా ఇచ్చిన రోజు జులై 6 అని కావున ప్రపంచ జునోసిస్ దినోత్సవంగా పరిగణలోకి వచ్చిందని తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలను ఉచితంగా వేయడంతో పాటు జునోటిక్ వ్యాధులపై అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు.

భీమడోలు: ప్రపంచ జునోసిస్ దినోత్సవం పురస్కరించుకొని భీమడోలు ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని అన్ని పశువైద్యశాలల వద్ద ఉచిత ర్యాబీస్ నిరోధిక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇకుర్తి సాయి రమేష్ తెలిపారు. రాబిస్ వ్యాక్సిన్ తయారుచేసిన శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ జ్ఞాపకార్థం ప్రపంచవ్యాప్తంగా జునోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముళ్లచెట్లు తొలగింపు

చాట్రాయి: మండలంలో నరసింహారావు పాలెం నుంచి నరసాపురం వెళ్లే రోడ్డు మార్గంలో ముళ్లచెట్లు రోడ్డు మీదకు రావడంతో ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో శుక్రవారం గ్రామంలోని నాయకులు, అధికారులు జెసిబి సాయంతో ముళ్లచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి గార్లపాటి మారేష్, వార్డు మెంబర్ కట్ట నాగ దుర్గారావు, టిడిపి నాయకులు ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి అభినందన : ఎంఎల్ఎ

చింతలపూడి : సిఎం నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, అందుకు సచివాలయ సిబ్బంది వందకు వందశాతం పెన్షన్ పంపిణీ చేశారని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. ఈమేరకు నియోజకవర్గంలో పెన్షన్ పంపిణీ చేసిన అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఆయన శుక్రవారం బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా అధికారులు పనిచేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది ఎంఎల్ఎను అభినందించారు.

బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న ఎంఎల్ఎ

ప్రజానాయకులు అనుసంధానకర్తలు

ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి, ప్రజలకు ప్రజానాయకులు అనుసంధానకర్తలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ పాలనపై సమ్మెముద్రలు, ప్రజానిందలు రాకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్ కార్మికవర్గంపై ఉందని అన్నారు. ఏలూరు కోటదిబ్బ ఎస్ఆర్‌వన్ వద్ద ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ 35వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి పతాకాన్ని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అదేవిధంగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి ఎంఎల్ఎ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇపి కొండలరావు, డిఇఇ తాతబ్బాయి పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ బడేటి చంటి మొక్కలు నాటారు.

బోరులో ఇరుక్కుపోయిన మోటారు, పంపు

కొత్తది బిగించి ప్రారంభించిన సర్పంచి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వైఎస్ఆర్ కాలనీలో పంచాయతీకి చెందిన తాగునీటి బోరులో సుమారు 90 అడుగుల లోతున మోటారు, పంపు ఇరుక్కుపోయింది. ఈబోరు నుంచే వైఎస్ఆర్, ఎన్‌టిఆర్ కాలనీ ప్రజలకు తాగునీటిని ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు ద్వారా అందించాల్సి ఉంది. గత నాలుగు రోజులుగా బోరు పనిచేయక పోవడంతో ఎన్‌టిఆర్ కాలనీలో మరో బోరు నుంచి డైరెక్టు పంపింగ్ చేయగా ఎన్‌టిఆర్ కాలనీ ప్రజలకు సంచార ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. ఈక్రమంలో నాలుగు రోజుల నుంచి బోరులో ఇరుక్కుపోయిన పంపు, మోటారును బయటకు తీసేందుకు అన్ని విధాల సాంకేతిక ప్రయత్నాలు చేసి భూమి లోపల ఇసుక, రాళ్ల మధ్యలో మోటారు, పంపు పూడుకు పోవడంతో దాన్ని అదే బోరులో 300 అడుగుల లోతుకి వెళ్లిపోయేలా చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి కొత్త మోటారు, పంపును బిగించి గురువారం బోరులోకి దించి నీటి సరఫరాలను పునరుద్దరించామని సర్పంచి దిడ్ల అలకనంద పేర్కొన్నారు. సర్పంచి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి దుర్గాధర్, ట్యాంకు వాచర్ శ్రీను, పంతగాని గంగాచలం, సిబ్బంది నాలుగు రోజులుగా పనులను పర్యవేక్షించారు. భూగర్భంలో ఇసుక పొరలు ఒక్కోసారి వర్షాకాలంలో ఎక్కువగా రావడంతో పంపు, మోటారులు ఇరుక్కుపోవడం జరిగిందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెప్పారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన పాలకవర్గానికి, అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా డ్రెయినేజీ పూడికతీత

ముదినేపల్లి: మండల కేంద్రమైన ముదినేపల్లిలో గత వారం రోజులుగా డ్రెయినేజీల్లో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో, ప్రధాన ఆర్ అండ్ బి రహదారుల వెంబడి ఉన్న డ్రెయినేజీల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో మురికి నీరు డ్రెయిన్‌లలో కూడిక కారణంగా బయటకు పారుదల లేక నివాసాల వద్ద నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో డ్రెయినేజీలపై పక్కా కట్టడాలు నిర్మించిన, అక్రమ కట్టడాలను ప్రోక్లైన్‌తో తొలగించి ఎంతో కాలంగా డ్రెయిన్లలో దట్టంగా పేరుకుపోయిన మట్టి పూడికను బయటికి తీసి ట్రాక్టర్లలో పూడిక మట్టిని బయటకు మళ్లిస్తున్నారు. ఈ పనులను గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మతో పాటు గ్రామ ఉపసర్పంచి ఈడే సుధాకర్, కార్యదర్శి జి.రమేష్ పర్య వేక్షిస్తున్నారు. ఎంతోకాలంగా ముదినేపల్లిని పట్టిపీడిస్తున్న డ్రెయినేజీ సమస్య పూడికతీత పనులతో పరిష్కారం అయ్యింది.

నూజివీడు టౌన్: మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు తక్షణమే మురికి నీటి కాలువ పూడికతీత పనులు మున్సిపల్ సిబ్బంది ప్రారంభించారు. గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన ముఖ్యమైన సమస్యల్లో ఒక్కటైన మురిగి నీటి కాలువ పూడికల సమస్యను విన్న మంత్రి కొలుసు పార్థసారథి తక్షణమే డ్రెయినేజీ పూడికలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. మరుసటిరోజు ఉదయమే మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కొన్ని వార్డుల్లో పూడిక తీసివేత పనులు తక్షణమే చేపట్టడంతో స్థానిక ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇకనుంచి డ్రెయినేజీ సమస్య తీరి, దోమల బెడద లేకుండా పరిశుభ్రమైన వాతావరణంలో జీవిస్తామని నగర ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జ్వరాల బారిన గ్రామస్తులు

ముసునూరు: మండలకేంద్రమైన ముసునూరు గ్రామంలో గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతున్నారు. గత వారం రోజుల నుంచి పలు ఇబ్బందులకు గురైవుతున్నారు. ముసునూరు గ్రామానికి చెందిన పెరిచర్ల వెంకటేష్ అను బాలుడు అనారోగ్యానికి గురికాగా, అతన్ని ముసునూరు పిహెచ్‌సి వైద్య పరీక్షలు నిర్వహించారు. డయేరియా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో వారి తల్లిదండ్రులకు తెలపగా, వారు మెరుగైనా వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి, డయేరియా లక్షణాలు లేవుని, డెంగీ వున్నట్లు తెలిపారని ముసునూరు పిహెచ్‌సి వైద్యులు షకినా తెలిపారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ముసునూరు గ్రామంలో అపరిశుభ్రమైన వాతావరణం వుండటం వల్ల కొన్ని రోగాలు బయటపడుతున్నాయన్నారు. మండల శాఖాధికారులు చర్యలు తీసుకుని పరిశుభ్రమైన వాతావరణం చేపట్టాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ముసునూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందుస్తూ జాగ్రత్త చర్యల్లో భాగంగా పిల్లలు, బాలింతలు, గర్భవతులు పరిశుభ్రత పాటిస్తూ, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ టీచర్ పల్లిపాము రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతలవల్లి గ్రామంలోని గోగులంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు, బాలింతలకు, గర్భవతులకు పలు సూచనలు చేశారు.

నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా కొక్కిరపాటి

భీమడోలు: గుండుగొలను నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా కొక్కిరపాటి నాగరాజు ఎన్నికయ్యారని ప్రతినిధులు తెలిపారు. గుండుగొలను నాయి బ్రాహ్మణ సామాజిక భవనం వద్ద శుక్రవారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో నూతన అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులుగా కె.విశ్వనాథం, కార్యదర్శిగా తుమ్మలపూడి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎ.శ్రీనివాసరావు ఎన్నికయ్యారని సంఘ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా అల్లూరి జయంత్యుత్సవాలు

ఏలూరు అర్బన్: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలను శుక్రవారం స్థానిక అశోక్ నగర్‌లోని అశోకవర్ధని మున్సిపల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సహాయ ప్రధానోపాధ్యాయురాలు పి.హైమావతి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అల్లూరి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రతీన భూనారు. ఉత్సవ కమిటీ సభ్యులు పి.ఆదిశేషు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.నాగమణి, ఆర్.స్వరూప రాణి పాల్గొన్నారు.

కామవరపుకోట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు చేసిన పోరాటాల గురించి భవిష్యత్ తరాలకు, ముఖ్యంగా ఇప్పటి చిన్న పిల్లలకి తెలియాల్సిన అవసరం ఉందని సిపిఎం నాయకులు తెలిపారు. గురువారం అల్లూరి జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లాలోని కృష్ణదేవి పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సమాధి వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో సిపిఎం నాయకులు పి.రామకృష్ణ, జె.సూర్యకిరణ్, పి.చంటి, జి.వెంకట్రావు, బుల్లెమ్మ, రాణి, విజయలక్ష్మి, బేవమ్మ, అంగన్వాడీ వర్కర్స్ సరుపు పోసమ్మ, భాను లక్ష్మి కుమారి, విజయమ్మ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

యాదవులకు అండగా ఉంటా : ఎంఎల్ఎ

ద్వారకా తిరుమల: మండలంలోని అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో గోపాలపురం నియోజకవర్గ ఎంఎల్ఎ మద్దిపాటి వెంటరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. యాదవుల మనోభావాలు, అభివృద్ధిని గురించి చర్చించారు. మండల యాదవ సోదరులకు ఎప్పుడు అండగా ఉంటానని ఎంఎల్ఎ భరోసా ఇచ్చారని యాదవ సంఘ నాయకులు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎను శాలువాతో సత్కరించి, రాధాకృష్ణ ఫోటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంపసాటి రామకృష్ణ, మండల యూత్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి'

ఏలూరు టౌన్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని, హెల్మెట్ పెట్టుకోకపోతే వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని డిఎస్‌పి గోలి లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి పోలీస్ స్టేషన్‌లో సిఐ కొండపల్లి శ్రీనివాస్, దెందులూరు ఎస్ఐ స్వామి, పెదపాడు శేఖర్, పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి డిఎస్‌పి లక్ష్మయ్య మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించి హెల్మెట్ వాడడం వల్ల ఎలాంటి ప్రమాదాలు భారిన పడినా తలకు దెబ్బలు తగలకుండా ఉంటుందన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. హెల్మెట్ వాడకంపై గ్రామ గ్రామాన డివిజన్ పరిధిలోని, అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని డిఎస్‌పి తెలిపారు.

'అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలి'

కామవరపుకోట: రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందరికీ చేరే విధంగా కృషి చేయాలని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజును అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బాతుల వేణు కోరారు. మానుకొండ ఇమ్మనీయేలు, సురేంద్ర పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S.No.479/2020

బిట్వీన్ :
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆలమూరు బ్రాంచి ...వాది
మరియు
వేములు సీత మరియొకరు ...ప్రతివాదులు

To.
Defendant No.1 : Vemula Sita, W/o.Krishna, H/FM, Age.37 Yrs, Agriculture, Gaggiparru (V), Elamanchili Mandal, W.G.Dt., A.P.
Defendant No.2 : Thonta Srinivasa Rao, S/o.Rama Rao, H/M, Agriculture, Sambhunipeta, Palakollu, Palakollu (M), W.G.Dt., A.P.

పై నంబరు దావాలో ప్రతి వాదులయిన మీరు కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.12.07.2024**వ తేదికి వాయిదా వేసినారు. కావునా ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు శ్రీపైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

CH.Durga Poornima
Advocate, Eluru.
Cell: 7386441140

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.7/2014

వాది: పుచ్చకాయల నవీన్
Vs
ప్రతివాదులు : పుచ్చకాయల కృష్ణమూర్తి (Died) వగైరా

నోటీసు

9వ ప్రతివాది : నల్లి సోనీ, భర్త నాని, మేడపాడు గ్రామము, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు O.S.No.7/2017, 9వ ప్రతివాది అయిన మీకు పైకోర్టు నుండి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరగనందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు **ది.18-07-2024**వ తేదీన ఉదయం 10.00 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరు అయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై దావాని మీ పరోక్షమున తీర్మానించబడును, గాన మీకు తెలియజేయడమైనది.
కోర్టు ఉత్తర్వుల ప్రకారం

దేవ రంజిత్ కుమార్, చొప్పల అశోక్
నర్సాపురం వాది తరపున అడ్వకేట్స్, నర్సాపురం.
తేది.5-7-24 సెల్: 9848332116

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 52/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
వేముల స్వాతి అండ్ అనదర్ -ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల సుశీల, W/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 122/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
వేముల వెంకటరత్నం గాంధీ అండ్ అనదర్ -ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల వెంకటరత్నం గాంధీ, S/o. మోహనరావు, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల నాగలక్ష్మి, W/o. వెంకటరత్నం గాంధీ, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 151/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం -వాది
అండ్
మర్నీడి కవిత అండ్ అనదర్ -ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: మర్నీడి కవిత, W/o. శివరామకృష్ణ, డోర్ నెం. 2-47, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 105/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం -వాది
అండ్
పీతాని పద్మావతి అండ్ అనదర్ -ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: పీతాని పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-90, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: మాదేటి నరశింహస్వామి, S/o. రామానుజయ దాసు, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 170/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం -వాది
అండ్
పీతాని పద్మావతి అండ్ అనదర్ -ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: పీతాని పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-90, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628